సాక్షి నంద్యాల

శనివారం । 23 । ఆగస్టు । 2025



డాక్టరు గారూ..ఇదేం రోగం!

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వెళ్లిన రోగులు వైద్య పరీక్షలు ప్రైవేట్‌లో చేయించుకోవాల్సిందే. అలాగే మందులు కూడా బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. 8లో▸



రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణకు శుక్రవారం డోన్‌కు చెందిన రాజవిజయ్‌కుమార్ దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఏఈవో సతీష్, పర్యవేక్షకురాలు పి.దేవికకు అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,624.53
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 74.968
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 98,843
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 94,551

న్యూస్‌రీల్

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల: గ్రీవెన్స్ డే నిర్వహిస్తూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది వారి సమస్యలను నిర్భయంగా తెలపవచ్చన్నారు. విధినిర్వహణలో సిబ్బంది ఇబ్బందులు పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు.

ఔషధాల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

గోస్పాడు: ఔషధాల విక్రయాల్లో నిబంధనలు పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, ఔషధ నియంత్రణ అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవి అన్నారు. నంద్యాల పట్టణంలోని తేజస్వి హోటల్‌లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు హనుమన్న, జయరాముడు ఆధ్వర్యంలో నార్కోటిక్స్ డ్రగ్స్ వినియోగంపై శుక్రవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్‌ను డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ మేరకే విక్రయించాలన్నారు. ఔషధాల విక్రయాల్లో నిబంధనలు ఉల్లంగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మందుల కొనుగోలు, అమ్మకాలపై దుకాణ యజమానులు రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, మెడికల్ ఏజెన్సీల సంఘం నాయకులు బొబ్బిటి దామోదర్ రెడ్డి, మెడికల్ షాపుల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

- 24 నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ మెరిట్ జాబితాలను శుక్రవారం విద్యాశాఖ విడుదల చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 25న నోటిఫికేషన్ జారీ చేసి జూన్ 6వ తేదీ నుంచి జూలై 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 53,733 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణ గతంలో ఎప్పుడూ లేని విధంగా నెల రోజులపాటు నిర్వహించడంతో అభ్యర్థులకు అనేక అనుమానాలు తలెత్తి ఆందోళనతో నెల రోజులుగా తృతీయ ఫలితాలకు మెరిట్ జాబితా కోసం ఎదురుచూస్తున్నారు. న్యాయస్థానాలు కల్పించుకొని డీఎస్సీ మెరిట్ జాబితాలపై ఇచ్చిన ఆదేశాల మేరకు మెరిట్ జాబితాలను విడుదల చేసింది. వాస్తవానికి పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ ఇచ్చిన పోస్టులకు ఒక్కో పోస్టుకు ఒక్కరిని ఎంపిక చేసి మొదటగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేయాలని నిర్ణయం తీసుకుంది. అయితే అభ్యర్థులు మెరిట్ జాబితా విడుదల చేయకుండా సర్టిఫికెట్ల పరిచశీన ఎలా చేస్తారో అంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇటీవల కోర్టు తీర్పుతో ఎట్టకేలకు మెరిట్ జాబితాలు విడుదల చేసిన విద్యాశాఖ ఈనెల 24 నుంచి టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలన చేయనున్నారు. ఇందుకు జిల్లాలో మూడు కేంద్రాలను ఎంపిక చేశారు. రాయలసీమ యూనివర్సిటీ, శ్రీ లక్ష్మీ శ్రీనివాస బీఈడి కాలేజీ, రాఘవేంద్ర బీఈడి కాలేజీల్లో సర్టిఫికెట్లను పరిశీలన చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారులు 60 కమిటీలను ఏర్పాటు చేశారు.



కొత్తపల్లిలోని సొసైటీ వద్ద ఎరువుల కోసం నిరీక్షిస్తున్న అన్నదాతలు (ఫైల్)

ఇంకెన్నాళ్లు.. ఎరువు చూపులు!

సాగునీటి కాల్వల కింద వరి సాగు ఊపందుకుంది. సకాలంలో యూరియా వినియోగిస్తేనే దిగుబడి ఆశాజనంగా ఉంటుంది. అయితే పంటకు ఎరువు వేద్దామంటే బస్తా కూడా దొరకని పరిస్థితి. జిల్లాకు వచ్చిందంతా రైతులకు చిక్కకుండా మార్గమధ్యలోనే కూటమి నేతలు దారి మళ్లిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు అమ్మేస్తున్నారు. రైతు సేవా కేంద్రాలు, సొసైటీ కార్యాలయాల ఎదుట రైతులు ఎరువుల కోసం నిరీక్షిస్తున్నారు. రోడ్డెక్కి మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేరు. ఇంకెన్నాళ్లు.. యూరియా కష్టాలు అంటూ అన్నదాతలు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

- ఎరువుల సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం
- నెల వారి కోటా సరఫరాలో జాప్యం
- యూరియా బస్తాలను తన్నుకుపోతున్న పచ్చనేతలు
- ఆర్ఎస్‌కేలు, సొసైటీల వద్ద అన్నదాతల పడిగాపులు

నంద్యాల(అర్బన్): రోజులు గడుస్తున్నా యూరియా సమస్య పరిష్కారం కావడం లేదు. రైతు సేవా కేంద్రాల వద్ద నో స్టాక్ బోర్డులు రైతులను వెక్కిరిస్తున్నాయి. వినియోగానికి తగ్గట్టు సరఫరా చేయడంలో అధికారులు చేతులెత్తేశారు. అరకొరగా వచ్చినా వాటిని కూటమి నేతల చేతుల్లో పెట్టి చోద్యం చూస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రైతులు వరి, మొక్కజొన్న, కంది, పత్తి, మిరప, మినుము తదితర పంటలను సాగు చేస్తున్నారు. ముఖ్యంగా కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్సార్బీసీ తదితర కాల్వల ఆయకట్టులో సాగు ఊపందుకుంది. సాగుకు అనుగుణంగా ఎరువులు సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోంది. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లాలో 2.51 లక్షల మంది వ్యవసాయ రైతులు ఉండగా 2.38 లక్షల హెక్టార్లలో పంటల సాగు విస్తీర్ణంగా అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. జిల్లా రైతులకు 31,981 మెట్రిక్ టన్నుల యూరియా అవసరంగా అధికారులు గుర్తించారు. అయితే రైతులకు సరిపడా ఎరువులను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఈ సీజన్‌లో యూరియా అరకొరగా సరఫరా అవుతుండటంతో కంపెనీలు తమ టార్గెట్ మేరకు నెలవారీ కోటా ప్రకారం సరఫరా చేయడం లేదని తెలుస్తోంది. ఆగస్టు నెలకు సంబంధించి 13,688 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 8,191 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. 2019–24 మధ్య కాలంలో విస్తారంగా వర్షాలు పడటంతో భూగర్భజలాలు పెరిగాయి. దీంతో వరి విస్తీర్ణం, ఉద్యాన పంటల సాగు కూడా స్థిరంగా కొనసాగుతోంది. వీటిని దృష్టిలో పెట్టుకుని యూరియా ప్రతిపాదనలు పెంచకుండా గత పదేళ్లుగా ఉన్న కేటాయింపుల ప్రకారమే ఇస్తుండటంతో సమస్య ఎదురైంది. కనీసం కేటాయింపుల మేరకు అయినా సరఫరా కాకపోవడంతో కొరత ఏర్పడి రైతులు అవస్థలు పడుతున్నారు.



ఆర్ఎస్‌కేకు వచ్చిన ఎరువులను ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

రాబోయే రోజుల్లో మరింత జఠిలం..

ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి కేసీ, తెలుగుగంగ, ఎస్సార్బీసీ కింద జూలై, ఆగస్టు మాసాల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి నాట్లు ఊపందుకున్నాయి. పంటల సాగుకు అవసరమైన యూరియా కష్టాలు వరి నాట్లతోనే మొదలయ్యాయి. ఈనెలతో పాటు వచ్చే సెప్టెంబర్‌లో కూడా పంటలకు యూరియా వాడకం అధికంగా ఉంటుంది. దీంతో ముందు ముందు యూరియా సమస్య మరింత జఠిలం కానుంది. కోటా మేరకు సరఫరా చేసి ఉంటే సమస్య ఉండేది కాదు. స్థానిక కూటమి నేతలు మధ్యలోనే గద్దల్లా తన్నుకపోతూ రైతులకు ఎరువులు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. యూరియా సరఫరాపై అటు వ్యవసాయశాఖ ఇటు మార్క్‌ఫెడ్ అధికారులు నోరుమెదపడం లేదు.

జిల్లాలో ఎరువుల వివరాలు	ఆగస్టు నెల అవసరం	ఇప్పటి వరకు వచ్చినది	సగానికి పైగా
►	13,688 మెట్రిక్ టన్నులు	8,191 మెట్రిక్ టన్నులు	కూటమి నేతల దారి మళ్లింపు

మార్క్‌ఫెడ్ కేంద్రంగా మాయాజాలం...

వ్యాగిన్‌ల ద్వారా నంద్యాల జిల్లాకు వస్తున్న ఎరువులను సంబంధిత అధికారులు మార్క్‌ఫెడ్, డీలర్లకు సరఫరా చేస్తారు. మార్క్‌ఫెడ్ నుంచి ఆర్ఎస్‌కేలు, సొసైటీలకు ప్రభుత్వం నుంచి వచ్చే ఎరువులు సరఫరా అవుతాయి. ప్రధానంగా యూరియా కొరత లేదని అధికారులు చెబుతున్నా మధ్య దళారులు దోపిడీ చేస్తుండటంతో రైతులకు మద్దతు ధరతో యూరియా దొరికే పరిస్థితి లేకుండా పోతుంది. డీలర్ల వద్ద కొనుగోలు చేద్దామంటే అధిక ధరతో పాటు అదనపు సరుకు కొనుగోలు చేస్తే యూరియా ఇస్తామంటూ షాపు యజమానులు చెబుతున్నారు. దీంతో రైతులు ఏం చేయాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

పచ్చనేతలు దారి మళ్లింపు

నంద్యాల మార్క్‌ఫెడ్ నుంచి ఈనెల 19వ తేదీన నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలం పసురపాడు గ్రామానికి 266 బస్తాల లోడ్‌తో లారీ యూరియా వెళ్లింది. బయల్దేరిన లారీ గ్రామానికి చేరకుండానే మధ్యలోనే మాయమైంది. యూరియా లారీ మాయం కావడంపై సంబంధిత మండల వ్యవసాయాధికారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మండలానికి చెందిన పచ్చ నాయకులు యూరియాను అమ్ముకున్నట్లు వెలుగు చూసింది. సంఘటన జరిగి నాలుగు రోజులు అవుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ప్రకటనలకు పరిమితమవడం విమర్శలకు తావిస్తోంది. ఒక పసురపాడు గ్రామంలోనే కాకుండా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పచ్చనేతలు ఆర్ఎస్‌కేలు, సొసైటీలకు వచ్చిన ఎరువులను అక్రమార్గాల్లో తరలిస్తూ సొమ్ము చేసుకోవడం జరుగుతుంది.

ఎప్పుడు వెళ్లినా స్టాక్ లేదంటున్నారు



సొంత పొలం 10 ఎకరాలతో పాటు మరో 19 ఎకరాలు కౌలుకు తీసుకొని మామిడి, సపోట తోటలు, వరి సాగు చేస్తున్నాను. యూరియా కోసం సహకార సొసైటీ, రైతు సేవా కేంద్రాలకు వెళ్తే స్టాక్ లేదంటున్నారు. ఇవాళ, రేపు అంటూ కాలయాపన చేస్తున్నారు. వారిపై నమ్మకం లేక బస్తాకు అదనంగా రూ.50 చెల్లించి బయట నుంచి కొనుగోలు చేశాను. ఇలాగైతే పంటలు సాగు చేసేది ఎలా? ప్రభుత్వమే యూరియా కొరత లేకుండా చూడాలి.

– బొగ్గుల లక్ష్మన్న, రైతు, వెలుగోడు

కూటమి నేతల దోపిడీ



కూటమి ప్రభుత్వంలోని గ్రామస్థాయి నాయకులు చేస్తున్న యూరియా దోపిడీతో వ్యవసాయం చేసుకోలేని పరిస్థితి నెలకొంది. నాకున్న పొలంతో పాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, ఇతర పంటలు సాగు చేశా. ప్రతి పంటకు యూరియా అవసరం. గత ఏడాది యూరియా కొరతతో దిగుబడులు తగ్గి తీవ్రంగా నష్టపోయా. ఈ ఏడాది కూటమి నాయకులు యూరియా బస్తాలు కానరాకుండా చేస్తున్నారు.

– శంకర్‌రెడ్డి, రైతు, లింగాపురం, బండిఆత్మకూరు

ఉద్యమబాట తప్పదు



యూరియా కోసం అన్నదాతలు సొసైటీలు, ఆర్ఎస్‌కేల వద్ద బారులుదీరుతున్నారు. కూటమి ప్రభుత్వానికి ముందు చూపులేదు. డిమాండ్ మేరకు సరఫరా చేయాలి. లేకపోతే ఉద్యమ బాట పట్టాల్సి ఉంటుంది.

– రామచంద్రుడు, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, నంద్యాల

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



నంద్యాల: ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించినా.. కృత్రిమ కొరత సృష్టించినా.. కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, విజిలెన్స్ అధికారులను కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో రైతులకు యూరియా సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నంద్యాల నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులు తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. యూరియా సరఫరా విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగిందని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ ప్రణాళికలతో ఎరువుల సరఫరా చేస్తుందన్నారు. రైతులకు మరింత భరోసా కల్పించేలా మార్క్‌ఫెడ్‌కు 50 నుంచి 70 శాతం ఎరువుల కేటాయింపులను పెంచడం జరిగిందన్నారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కృత్రిమ కొరత సృష్టించినా, కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, విజిలెన్స్ అధికారులకు సూచించారు.



వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న చెంచు ముత్తైదువులు

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

శ్రీశైలంటెంపుల్: ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా శ్రీశైల దేవస్థానం శ్రావణ ఐదో శుక్రవారాన్ని పురస్కరించుకుని వైభవంగా ఉచిత సామూహిక వరలక్ష్మీవ్రతాలను నిర్వహించింది. ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న చంద్రవతి కల్యాణ మండపంలో నిర్వహించిన వ్రతాలకు చెంచు ముత్తైదువులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాలలోని దాదాపు 90గూడేలకు చెందిన సుమారు 650మంది చెంచు ముత్తైదువులు, 950 మందికి పైగా ఇతర భక్తులు వ్రతాన్ని నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.వెంకట శివప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. దేవస్థాన డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు పర్యవేక్షించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు వస్త్రం, పూలు, గాజులు, కైలాస కంకణాలు, వృక్షప్రసాదంగా తులసి, ఉసిరి మొక్కలు, శ్రీశైలప్రభ మాసపత్రిక అందజేశారు.



ప్రసంగిస్తున్న ఈఓ శ్రీనివాసరావు



వ్రతంలో పాల్గొన్న భక్తులు

సీఎం అండతోనే బుడ్డా బరితెగింపు

- అటవీ అధికారులపై దాడి చేసిన ఎమ్మెల్యే బుడ్డాపై చర్యలు తీసుకోరా?
- గెస్ట్‌హౌస్‌లో బంధించి, కులం పేరుతో దూషిస్తే తూతూ మంత్రంగా కేసు నమోదా?
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, కిడ్నాప్, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి
- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

బొమ్మలసత్రం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండతో శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి బరితెగించి అధికారులు, ప్రజలను వేధిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పాల్గొన్నారు. సమావేశంలో శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి విధుల్లో ఉన్న ఫారెస్ట్ సిబ్బందిని కిడ్నాప్ చేసి దాడి చేయటం దారుణమన్నారు. అర్ధరాత్రి తన అనుచరులతో కలిసి తప్పతాగి శ్రీశైల శిఖరం చెక్‌పోస్ట్‌లో విధుల్లో ఉన్న చెంచు కులానికి చెందిన గురువయ్య, గిరిజన కులానికి చెందిన రాములు నాయక్, మైనార్టీ వర్గానికి చెందిన కరిముల్లాను దుర్భాషలాడరన్నారు. అటవీ ఉద్యోగులను వాహనంలో ఎక్కించుకుని రాత్రంతా శ్రీశైలం మొత్తం కారులో తిప్పి కులం పేరుతో దుర్భాషలాడి మంత్రి గొట్టిపాటి రవికి చెందిన గెస్ట్‌హౌస్‌లో బంధించి దాడి చేయడం ఆటవిక చర్య అన్నారు. ఇంత జరిగితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పత్రికల్లో ఎమ్మెల్యే తీరుపై సీరియస్.. ప్రచారం చేసుకుంటూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అంత సీరియస్‌గా సీఎం చర్యలు తీసుకోవాలనుకుంటే ఎమ్మెల్యేపై కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేయించాలి కానీ అన్నీ చిన్నపాటి సెక్షన్‌లు మాత్రమే నమోదు చేయించడం దేనికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ వెంటనే స్పందించి ధర్మాన్ని కాపాడాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శ్రీశైలం నియోజకవర్గంలో నలుగురు వైఎస్సార్‌సీపీ నాయకులు హత్యకు గురయ్యారన్నారు. ప్రజలు ఇప్పటికే ఎమ్మెల్యేను బూతు రాజా, వసూల్ రాజాగా పిలుస్తున్నారంటే ఆయన తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. శ్రీశైలం ఆలయాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

అధికారులకే రక్షణ లేదు..

కూటమి ప్రభుత్వంలో ప్రజలతో పాటు అధికారులు, పోలీసులకు కూడా రక్షణ లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. టీడీపీ రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో నాయకులు చెప్పిన మాట వినని వారిపై కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి రెండు రోజుల క్రితం విధుల్లో ఉన్నా నలుగురు అటవీ ఉద్యోగులను తన కారులో కిడ్నాప్ చేసి కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడటం ఎంత వరకు సమంజసమన్నారు. సిబ్బంది అవినీతికి పాల్పడితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి కానీ ఎమ్మెల్యేనే వారిని కారులో తీసుకెళ్లి గెస్ట్‌హౌస్‌లో బంధించటం సరైంది కాదన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పోర్టులో రేషన్ బియ్యం తరలిస్తున్న షిప్‌ను సీజ్ ద షిప్ అంటూ డైలాగ్‌లు చెప్పడం కాదని, రేషన్ దందా నడుపుతున్న కూటమి నేతలపై చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్బీకేల ద్వారా ప్రతి రైతుకు పుష్కలంగా ఎరువులు సరఫరా చేశారని గుర్తుచేశారు. టీడీపీ పాలనలో కనీసం రైతుకు యూరియా బస్తా దొరకని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు గత ప్రభుత్వం కంటే ఎక్కువగా అందిస్తామని నమ్మించిన చంద్రబాబు ప్రజలను నట్టేట ముంచాడని ఆరోపించారు.

రెడ్‌బుక్ పాలనకు ఇదే నిదర్శనం..

రెడ్‌బుక్ పాలనలో టీడీపీ నేతల మాట వినని అధికారులపై కక్ష సాధింపు చర్యలకు ఎమ్మెల్యే బుడ్డా చేసిన దాడినే నిదర్శనమని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. కొలిమిగుండ్లలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోదరుడు ఒక ఏఆర్ కానిస్టేబుల్‌పై దాడి చేస్తే తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి వదిలేశారని గుర్తు చేశారు. కనీసం మంత్రి సోదరుడిని పోలీసులు అరెస్ట్ చేయడానికి కూడా వెనుకాడుతున్నారంటే ఇది ఎటువంటి ప్రభుత్వమో ప్రజలే తేల్చాలన్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఫారెస్ట్ అధికారులను కిడ్నాప్ చేసి దుర్భాషలాడినా ఆయనపై ముఖ్యమంత్రి ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయించి జైలుకు పంపి వేధింపులకు పాల్పడుతున్నారన్నారు.

అరాచకాలను ప్రజలే అడ్డుకుంటారు

రాష్ట్రంలో టీడీపీ నేతలు సుపరిపాలన అంటూ అరాచకాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేతల మాట వినని వారిని టార్గెట్ చేస్తూ తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఒక ఎమ్మెల్యే అర్ధరాత్రి అటవీ సిబ్బందిని కారులో ఎక్కించుకుని విచక్షణా రహితంగా దాడి చేయడం దారుణమన్నారు. అటవీ సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సిన ఎమ్మెల్యేనే కిడ్నాప్ చేసి వేధించటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. టీడీపీ నేతల అరాచకాలను ప్రజలే అడ్డుకుంటారన్నారు.

గణేష్ ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకుందాం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



జ్యూట్ బ్యాగ్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల: గణేష్ ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకుందామని జిల్లా కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గణపతి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఆయా శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మట్టి విగ్రహాలు నెలకొల్పేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. నంద్యాల పట్టణంలో నిర్వహించే నిమజ్జన కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. చిన్న చెరువు వద్ద బండ్ పటిష్టంగా ఉండాలన్నారు. గజ ఈతగాళ్లను నియమించుకోవాలని, లైటింగ్ ఏర్పాట్లు, శోభాయాత్ర సాగే రహదారి మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు, వైద్య శిబిరాలు, ట్రాఫిక్ మళ్లింపు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవ నిర్వాహకులు విగ్రహాల ఏర్పాటుకు గణేష్ ఉత్సవ్.నెట్‌లో నమోదు చేసుకోవడం ద్వారా సింగిల్ విండో అనుమతులు ఇవ్వడం జరుగుతోందన్నారు. అనంతరం మట్టి వినాయకుణ్ణి పూజిద్దాం – పరివర్యాణాన్ని రక్షిదాం అనే జ్యూట్ బ్యాగ్స్‌ను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. సమావేశంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, నంద్యాల ఏఎస్పీ మంద జావాలి అల్ఫోన్స్, నంద్యాల, ఆత్మకూరు ఆర్డీఓలు విశ్వనాథ్, నాగజ్యోతి పాల్గొన్నారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.1.08 కోట్లు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో చివరి సోమ, గురువారం హుండీలో భక్తులు సమర్పించిన కానుకలకు శుక్రవారం లెక్కించారు. నగదు రూపంలో రూ.1,08,04,708 వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. వెండి 22.500 కేజీలు, బంగారం 1.950 గ్రాములు వచ్చినట్లు చెప్పారు.

మద్యం మత్తులో అర్చకుల గొడవ

మహానంది: మద్యం మత్తులో మహానంది దేవస్థానానికి చెందిన ఇద్దరు అర్చకులు గొడవకు పాల్పడిన సంఘటన సోషల్ మీడియాలో రావడంతో చర్చనీయాంశమైంది. సుమారు నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహానంది దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అర్చకుల మధ్య గొడవ చోటు చేసుకోగా ఓ అర్చకుడు మరో అర్చకుడిని బెదిరించడంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది.

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలు మృతి


బోయ వల్లె మాదమ్మ(ఫైల్)

కృష్ణగిరి: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బోయ వల్లె మాదమ్మ(115) శుక్రవారం మృతి చెందారు. ఈమె భర్త ఓబన్న కొన్నేళ్ల క్రితమే మృత్యువాతపడ్డారు. మాదమ్మకు ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు కాగా, మనవళ్లు, మనవరాళ్లకు కూడా వివాహాలయ్యాయి. అంతా కలిపి దాదాపుగా 80 మంది సభ్యులుంటారు. అందరి పెళ్లిళ్లు కళ్లారా చూసిన మాదమ్మ మునిమనవళ్లతో ఆనందంగా గడిపేది. అనారోగ్య సమస్యలతోడు వయోభారం పెరగడంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కొన్నేళ్ల క్రితమే పాలపళ్లు కూడా వచ్చాయని వారు తెలిపారు.

48 సెల్ ఫోన్లు రికవరీ


బాధితులకు సెల్ ఫోన్లు అందజేస్తున్న పోలీసు అధికారులు

డోన్ టౌన్: చోరీకి గురైన 48 సెల్ ఫోన్లను డోన్ పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందజేశారు. శుక్రవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఐలు ఇంతియాజ్‌బాషా, సీఎం రాకేష్ మాట్లాడుతూ ఎవరైనా సెల్ ఫోన్లు పోగొంటుకుంటే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫోన్ ఐఎంఈఐ నంబరుతో లేదా వాట్సాప్ ద్వార ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు శరత్‌కుమార్ రెడ్డి, నరేంద్రకుమార్, ట్రైనింగ్ ఎస్ఐ రవ్రికాష్, సిబ్బంది ఉన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి దీవెన (ఫైల్)

హాలహర్వి: గూళ్యం గ్రామంలో ఓ మూడేళ్ల చిన్నారి జ్వరంతో బాధపడుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గాదిలింగ, పవిత్ర దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె దీవెన (03)కు జ్వరం ఎక్కువ కావడంతో గ్రామంలో వైద్యుల వద్ద చూపించినా తగ్గలేదు. దీంతో శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో జ్వరం తీవ్రత మరింత పెరగడంతో కర్ణాటక రాష్ట్రం బళ్లారి ఆసుపత్రికి తీసుకెళ్లే లోపు చిన్నారి మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. 11 వేల జనాభా ఉన్న తమ గ్రామంలో సరైన ఆసుపత్రి ఉంటే మా పాప బతికేదని తండ్రి గాదిలింగ రోదిస్తున్నాడు. గ్రామానికి సమీపంలోని వేదావతి నదిపై బ్రిడ్జిని నిర్మించి ఉంటే కేవలం 20 కి.మీ. దూరంలో బళ్లారి జిల్లా కేంద్రానికి సకాలంలో తీసుకెళ్లే వారమన్నారు. వంతెన లేకపోవడంతో గూళ్యం–హాలహర్వి–బళ్లారికి వెళ్లేందుకు 45 కి.మీ. పైగా దూరం ఉండటంతో ఆలస్యమై వైద్యం అందక బిడ్డ చనిపోయిందన్నారు.

29న కవి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న సాయంత్రం 6 గంటలకు టీజీవీ కళాక్షేత్రం సాహితీ వేదికలో తెలుగు కవుల సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు పత్తి ఓబులయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే కవులు తెలుగు భాషలో పద్యం, గేయం, కవిత్వంను మూడు నిమిషాల వ్యవధిలో చెప్పాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు 9989265632 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

డాక్టరు గారూ..ఇదేం రోగం!

- వైద్యపరీక్షలు ప్రైవేటు ల్యాబ్‌లకు
- ఇందులోనూ రాయలసీమ ల్యాబ్‌కు అధిక శాతం
- కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని అన్ని విభాగాల వైద్యులు సిఫారసు
- వైద్యపరీక్ష రాసిన వారికి 30 శాతం దాకా కమీషన్
- ఆసుపత్రిలో ఉన్న పరీక్షలు కూడా బయటకే!

ప్రైవేట్‌లో డబ్బులు ఖర్చు పెట్టి చూపించుకునే ఆర్థిక స్థోమత లేకనే పేదలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తారు. అలాంటి వారికి పైసా ఖర్చు ఖర్చుకాకుండా చూడాల్సిన వైద్యులే అకారణంగా మందులు, వైద్య పరీక్షలు బయటకు రాస్తున్నారు. ఇందుకు ఇక్కడ వైద్యపరీక్షలు త్వరగా ఇవ్వరని, మరికొన్ని లేవన్న సాకులు చెబుతున్నారు. దీంతో తప్పని పరిస్థితిలో పేదలు ఎండనక వాననక కాయకష్టం చేసి సంపాదించి దాచుకున్న డబ్బును వైద్య పరీక్షలకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ముఖ్యంగా ఆసుపత్రి ఎదురుగా ఉండే ఒక ల్యాబ్‌పై కొందరు వైద్యులు వల్లమాలిన అభిమానం చూపుతూ వైద్య పరీక్షలన్నీ అక్కడికే రాస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


కాలమ్మ అనే మహిళకు ఏఎన్ఏ పరీక్షను రాయలసీమ ల్యాబ్‌కు రాసిన వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, రాయచోటి జిల్లాల నుంచే గాక పక్క రాష్ట్రాలైన కర్నాటక, తెలంగాణాలోని పలు జిల్లాల నుంచి సైతం రోగులు చికిత్స నిమిత్తం వస్తున్నారు. ప్రతిరోజూ ఓపీ రోగుల సంఖ్య 2500 నుంచి 3వేల దాకా, ఇన్‌పేషంట్ల సంఖ్య 1200 నుంచి 1500ల దాకా ఉంటుంది. వీరిలో 70 శాతంకు పైగా రోగులకు పలు వైద్యపరీక్షలు అవసరం అవుతుంటాయి. రక్తపరీక్షలు, మూత్రపరీక్షలు, ఎక్స్‌రే, సీటిస్కాన్, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ వంటి పరీక్షలు ఆసుపత్రినే నిర్వహించేందుకు అవసరమైన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా డయాగ్నోస్టిక్ బ్లాక్‌ను నిర్మించారు. రోగులు ఆసుపత్రిలో అటు ఇటు తిరగకుండా అన్ని పరీక్షలు ఒకేచోట నిర్వహించేలా ఏర్పాటు చేశారు. ఇక్కడ దాదాపు అన్ని రకాల పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన రసాయనాలు, వైద్యపరికరాలు ఉన్నాయి.

ఆ ల్యాబ్ అంటే మక్కువ ఎక్కువ...!

ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉండే రాయలసీమ డయాగ్నోస్టిక్ ల్యాబ్ అంటే ప్రభుత్వ వైద్యులకు మక్కువ ఎక్కువలా కనిపిస్తోంది. వైద్యులు ప్రైవేట్‌కు రాసే వైద్యపరీక్షల్లో 80 శాతానికి పైగా పరీక్షలు అక్కడే నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. వైద్యపరీక్షలు రాసే వైద్యులకు ఈ ల్యాబ్ వారు భారీగా కానుకలు, కమీషన్లు ముట్టజెబుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడికి వెళ్లిన రోగులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి తక్కువ గాకుండా బిల్లు అవుతోంది. ఆసుపత్రిలో పరీక్షలు చేయిస్తే త్వరగా చేయరని, రిపోర్టులు ఆలస్యంగా వస్తాయని, అర్జెంటుగా వైద్యం చేయాలంటే బయట చేయించుకుని రావాలని పేర్కొంటూ పలువురు వైద్యులు రాయలసీమ ల్యాబ్‌కు వైద్యపరీక్షలు రాస్తున్నారు. ఇందులో అధికంగా గైనకాలజీ, చిన్నపిల్లల విభాగం, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, చర్మవ్యాధుల విభాగం, పలు సూపర్‌స్పెషాలిటీ విభాగాలు ఉన్నాయి.

రాయలసీమ ల్యాబ్‌కు రాసిన వాటిలో కొన్ని...

- ప్రభుత్వ సర్వజన వైద్యశాల నుంచి ఈ నెల 17న పద్మావతి (35) అనే రోగికి సీరమ్ ఎలక్ట్రోలైట్స్, థైరాయిడ్ ప్రొఫైల్, సీరమ్ క్రియాటినిన్ పరీక్షలు రాశారు. ఇందుకు రూ.1100 ఛార్జి చేశారు. ఈమెకే పాప్ స్మియర్ పరీక్ష రాయగా రూ.600 వసూలు చేశారు.
- ప్రభుత్వ ఆసుపత్రి నుంచి భవాని(25) అనే మహిళకు 7వ తేదిన యాంటీ సీసీపీ పరీక్ష రాయగా రూ.1,500 వసూలు చేశారు.
- అలాగే విజయ అనే మహిళకు సీరమ్ ఫెర్రిటిన్ పరీక్ష రాశారు.
- దేవమ్మ(65) అనే వృద్ధురాలికి 12వ తేదీన ఎంఎస్–6 నుంచి పీటీ ఐఎన్ఆర్ పరీక్ష రాయగా రూ.400 వసూలు చేశారు.
- స్వరూప అనే శిశువుకు చిన్నపిల్లల విభాగం వారు ఏబీజీ కిట్ పరీక్ష రాశారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో చేస్తున్న పరీక్షలను కూడా రాయలసీమ ల్యాబ్‌లో చేయించిన దృశ్యం

- చర్మవ్యాధుల విభాగం(డీవీఎల్) నుంచి కాలమ్మ(44) అనే మహిళకు ఇటీవల ఏఎన్ఏ ప్రొఫైల్ పరీక్ష రాశారు.
- రేష్మి(34) అనే మహిళకు పీటీ ఐఎన్ఆర్ పరీక్ష చేయించారు.
- జనరల్ మెడిసిన్ విభాగం నుంచి అశోక్‌కుమార్ అనే వ్యక్తికి పీటీ ఐఎన్ఆర్ పరీక్ష రాశారు.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో తీవ్ర జాప్యం

ఆసుపత్రిలోని డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో వైద్యపరీక్షలు చేయించుకోవాలంటే ఒక యుద్ధమే చేయాల్సి వస్తోందని రోగులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ ఉదయం రక్తపరీక్షకు ఇస్తే అందరికీ కలిపి మధ్యాహ్నం 2 గంటలకు రిపోర్టు ఇస్తున్నారు. ఆ రిపోర్టు తీసుకుని ఓపీకి వెళితే అప్పటికే వైద్యులు ఉండటం లేదు. మధ్యాహ్నం ఓపీలలో పీజీలు మాత్రమే వైద్యం చేస్తున్నారు. ఎక్స్‌రే పరీక్ష చేసినా రిపోర్టును మరుసటి రోజు ఇస్తున్నారు. అలాగే అల్ట్రాసౌండ్ పరీక్ష చేయించుకోవాలంటే కనీసం మూడు, నాలుగు గంటలు వేచి ఉండాలి. రోజుకు 400 రోగులకు పైగా వైద్యులు ఈ పరీక్ష చేస్తున్నారు. ఇక్కడ కూడా ఎక్కువ శాతం పీజీలే నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి మరునాడు ఉదయం వరకు అత్యవసర రోగులకు పరీక్ష చేయించుకోవాలంటే వైద్యులు త్వరగా అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఆసుపత్రిలో చెప్పుకోవడానికి మూడు సీటీ స్కాన్‌లు ఉన్నా పనిచేసేది రెండు మాత్రమే. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ వారు ఇచ్చిన సీటీ స్కాన్ నిర్వహించేందుకు సిబ్బంది లేరని ప్రారంభించలేదు. పీపీపీ కింద నిర్వహించే దానిలో అత్యవసర కేసులు, ప్రభుత్వ సీటీ స్కాన్‌లో ఇన్‌పేషంట్లకు పరీక్షలు చేస్తున్నారు. వీటి రిపోర్టులు ఇవ్వడానికి కొన్నిసార్లు రోజుకు పైగా పడుతోంది. ఎంఆర్ఐ స్కాన్ చేయించుకోవాలంటే రోజుల తరబడి వేచి ఉండాలి. అది కూడా ఇన్‌పేషంట్ అయితేనే ఈ పరీక్ష చేస్తారు. ఈ పరిస్థితులను ఆసరాగా చేసుకున్న కొందరు వైద్యులు ప్రత్యేకంగా రాయలసీమ ల్యాబ్‌కు మాత్రమే ఎక్కువగా రాయడం విమర్శలకు తావిస్తోంది.

బయటకు పరీక్షలు రాయొద్దని చెబుతున్నాము



ఆసుపత్రిలోని డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోనే అన్ని రకాల పరీక్షలు ఉన్నాయి. ఓపీ, ఐపీ రోగులకు ప్రైవేటు ల్యాబ్‌లకు పరీక్షలు రాయొద్దని వైద్యులకు చెబుతూనే ఉన్నాము. కొందరు అత్యవసరం పేరుతో రాస్తున్నట్లు ఉన్నారు. ఆసుపత్రిలో లేని కొన్ని మాత్రమే బయటకు రాస్తున్నారని తెలిసింది. ఆసుపత్రిలో ఉన్నా బయటకు రాసే వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాము.

–డాక్టర్ శ్రీరాములు, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

పోలూరు వంకాయకు త్వరలో దేశవ్యాప్త గుర్తింపు

- వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు

మహానంది: నంద్యాల జిల్లా పోలూరులో సాగయ్యే వంకాయకు త్వరలోనే దేశవ్యాప్త గుర్తింపు వస్తుందని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఠాగూర్ నాయక్, డాక్టర్ సీహెచ్ కిషోర్‌కుమార్, డాక్టర్ తమ్మాలి హేమాద్రి తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అనేక జిల్లాల నుంచి వ్యాపారులు పోలూరు వంకాయల కోసం వస్తుంటారన్నారు. ఇక్కడ పండించే వంకాయ ఓ కూరగాయగానే కాకుండా ప్రాచీన సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలతో పాటు అనంతపురం, ప్రకాశం, కడప, చిత్తూరు జిల్లాల్లోనూ ఈ పంట సాగవుతుందన్నారు. ఇంతటి ప్రసిద్ధి చెందిన పోలూరు వంకాయకు వ్యవసాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్(జీఐ) ట్యాగ్ పొందితే దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందన్నారు. అప్పుడు ఈ వంకాయలు ప్రీమియం కస్టమర్ల మార్కెట్‌లోకి ప్రవేశించి సరైన ధర చెల్లించేందుకు సిద్ధంగా ఉన్న వినియోగదారులను ఆకర్షిస్తుందన్నారు. తద్వారా మార్కెట్‌లో మంచి ధరలు లభించడంతో రైతులకు మేలైన లాభా లు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలూరు వంకాయ ప్రత్యేకతపై పరిశోధనలు చేసి యూనివర్సిటీకి సమర్పించనున్నట్లు వారు వివరించారు.


వంకాయ మొక్కను, కాయలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అన్నదానానికి రూ. 2 లక్షల విరాళం


దాతకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయాధికారులు

కౌతాళం: ఉరుకుంద గ్రామంలోని ఈరన్న స్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదానానికి శుక్రవారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. డోన్ పట్టణానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, శృతి వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116, వెంకట తరుణ్‌రెడ్డి, రచనరెడ్డి వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116 చొప్పున నగదు అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు.

నిరాశజనకంగా ఉల్లి ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధరలు నిరాశజనకంగా ఉంటున్నాయి. శుక్రవారం మార్కెట్‌కు 88 మంది రైతులు 3,674 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు తెచ్చారు. కనిష్ట ధర రూ.505, గరిష్ట ధర రూ.1599 లభించింది. సగటు ధర రూ.1039 నమోదైంది. ఎకరాకు దాదాపు రూ.60 వేల పెట్టుబడి పెట్టారు. దిగుబడి ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్ ధరల ప్రకారం పరిశీలిస్తే ఎకరాకు రూ.40 వేలు కూడా దక్కని పరిస్థితి ఏర్పడింది. ఎకరాపై రూ.20 వేలు ఆపైనే నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే మార్కెట్‌కు వేరుశనగ 479 క్వింటాళ్లు వచ్చింది. వేరుశనగకు కనిష్ట ధర రూ.3,570, గరిష్ట ధర రూ.7022 లభించగా.. సగటు ధర రూ.6,756 నమోదైంది. కందుల కు కనిష్ట ధర రూ.4,497, గరిష్ట ధర రూ.6,426 లభించింది. కొర్రలు, మినుములు, శనగలు, ప్రొద్దుతిరుగుడు పంటలకు మరింత అధ్వానంగా ధరలు లభించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాల అమ్మకాలు!

- మోసపోతున్న ప్రజలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రభుత్వ భూమి ఖాళీ కనిపిస్తే చాలు అంగట్లో వస్తువుల్లాగా లక్షలాది రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. స్థలాలు వస్తాయనే ఆశతో చాలా మంది అమాయకులు మోసగాళ్ల మాయ మాటల్లో పడి లక్షలాది రూపాయలు ముట్టజెప్పుతున్నారు. కొలిమిగుండ్లలో కస్తూర్బా పాఠశాల ఎదురుగా ఉన్న జగనన్న కాలనీ వెనుక భాగం, మోడల్ స్కూల్ సమీపంలో 112, 322 తదితర సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి ఉంది. కొంత మంది గ్రూపుగా ఏర్పడి వివిధ గ్రామాల ప్రజలకు మూడు, ఐదు, ఆరు సెంట్ల చొప్పున విక్రయించి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. గతంలో ఈ గ్రూపు సభ్యులే పదుల సంఖ్యలో బోగస్ పట్టాలు ప్రజలకు ఇచ్చి ఏకంగా రిజిస్ట్రేషన్‌లు చేయించారు. అప్పట్లో ఉన్నతాధికారులు వీటిపై విచారణ చేపట్టారు. ఓ వీఆర్వో ప్రమేయం ఉండటంతో సస్పెన్షన్ చేశారు. కొద్ది రోజుల నుంచి ఆగ్రూపు సభ్యులే మళ్లీ ప్రభుత్వ భూమిని ఇష్టానుసారంగా అమ్మకాలు చేయడం మొదలు పెట్టారు.

ఇంత జరుగుతున్నా తెలియదా?

ప్రభుత్వ స్థలాన్ని ఇళ్ల స్థలాలు, తదితర వాటికి ఇవ్వాలంటే చాలా నిబంధనలు ఉంటాయి. రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించాకే స్థలాన్ని మంజూరు చేస్తారు. కానీ ఇక్కడ మాత్రం ముఠా సభ్యులు అన్నీ తామై వ్యవహరించి వారి స్వంత ఆస్తులు అన్నట్లుగా ఇష్టానుసారంగా అమ్మకాలు చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నా రెవెన్యూ అధికారులకు తెలియదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వాళ్ల అండదండలతోనే ఈ తంతు జరుగుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ స్థలాలు విక్రయిస్తున్న ముఠా సభ్యులు రెవెన్యూ సిబ్బంది సంతకాలు, సీళ్లను సైతం పోర్జరీ చేస్తున్నట్లు సమాచారం. అన్నీ వాళ్లే తయారు చేసి బోగస్ అనుబంధ పట్టాలను ఇచ్చి ప్రజలతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే పదుల సంఖ్యలో సెంట్ల ప్రకారం అమ్మకాలు చేసినట్లు తెలుస్తుంది. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన జనం చాలా మంది నిర్మాణాలు మొదలు పెట్టడం శోచనీయం. ముఠా సభ్యుల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే ప్రభుత్వ భూమి కనుమరుగై పోయే ప్రమాదముందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని అమాయక ప్రజలు మోసపోకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు.


జగనన్న కాలనీ వెనుక భాగంలోని స్థలంలో నిర్మాణాలు చేసిన దృశ్యం


బోగస్ అనుబంధ పట్టా

బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం

ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల వద్ద బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. మాయ మాటలు చెప్పి ప్రభుత్వ స్థలాలు కొంటే ఏమాత్రం చెల్లుబాటు కావు. ప్రజలు ఎవరూ మోసపోవద్దు. ఇప్పటికే గ్రామాల్లో కొన్ని చోట్ల అడ్డుకట్ట వేశాం. మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసులు, తహసీల్దార్

డీఈఈగా పవన్‌కుమార్ రెడ్డి

కర్నూలు (టౌన్): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న యం.పవన్‌కుమార్ రెడ్డికి ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఆయన్ను కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రజారోగ్య సాంకేతిక శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ప్రభాకర రావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

అయ్యో పాపం!

- సీసీ కెమెరాలో విద్యార్థుల దృశ్యాలు

ఆస్పరి: మండలంలోని చిగిళి గ్రామంలో బుధవారం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న 6 మంది విద్యార్థులు నీటి కుంటలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఆరోజు పాఠశాల వదిలిన వెంటనే ఇళ్ల దగ్గర బ్యాగులు పెట్టి నీటి కుంట దగ్గరకు పరిగెడుతు వెళ్తున్న దృశ్యాలు గ్రామానికి చెందిన వలిబాషా సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలు వైరల్ అయ్యాయి. చూసిన వారు 'అయ్యో పాపం చిన్నారులు' అని అంటున్నారు. వలిబాష అనే వ్యక్తి మెకానిక్ షాపు పెట్టారు. షాపు దగ్గర ఈయన సీసీ కెమెరాలను అమర్చుకున్నారు. విద్యార్థులు వెళ్లిన దృశ్యాలను ఆయన గ్రామస్తులకు చూపించారు.


మొదటి నలుగురు విద్యార్థులు వెళ్తున్న దృశ్యం


తరువాత మరో ముగ్గురు విద్యార్థులు వెళ్తున్న దృశ్యం

ఇంజినీరింగ్ కాలేజీల్లో తగ్గిన ప్రవేశాలు

కర్నూలు సిటీ: జిల్లాలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో ఈ ఏడాది ప్రవేశాలు తగ్గాయి. మొత్తం 12 ఇంజినీరింగ్ కాలేజీల్లో ఉన్న సీట్లలో 83.3 శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. గతేడాది కంటే ఈ ఏడాది 2.38 శాతం అడ్మిషన్లు తగ్గాయి. కంప్యూటర్ ఆధారిత కోర్సులను అభ్యసించేందుకు ఎక్కువ శాతం మొగ్గు చూపుతున్నారు. భర్తీ అయిన సీట్లలోనూ అత్యధికంగా సీఎస్ఈ, ఈసీఈ బ్రాంచ్‌లతో పాటు సీఎస్ఎం, సీఎస్‌డీ, సీఏఐ కోర్సులు ఉన్నాయి. రాయలసీమ వర్సిటీ ఇంజినీరింగ్‌లో సివి ల్, మెకానికల్ బ్రాంచ్‌లు మినహా మిగిలిన ఈసీఈ, సీఎస్ఈ బ్రాంచ్‌లలో 45.8 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.

ప్రవేశాలు ఇలా.. ఉమ్మడి జిల్లాలో రాయలసీమ వర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజీతో పాటు మొత్తం 12 కాలేజీలున్నాయి. మొత్తం 8052 వేల సీట్లు ఉన్నాయి. మొదటి విడతలోనే 6,804 సీట్లు భర్తీ అయ్యాయి. రెండో విడతలో మాత్రం 98 సీట్లు తగ్గి 6,706 అడ్మిషన్స్ కేటాయించారు. గతేడాది కంటే ఈసారి 2.38 శాతం అడ్మిషన్స్ తగ్గాయి. ఇంజినీరింగ్ కాలేజీల్లో ఈ ఏడాది ఏ బ్రాంచ్‌లో కూడా 100 శాతం సీట్లు భర్తీ కాలేదు. సీఎస్ఈ, ఈసీఈ బ్రాంచ్‌లలో అత్యధిక శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది గతేడాది కంటే సుమారు వెయ్యి సీట్లు కంప్యూటర్ ఆధారిత కోర్సులకు సీట్లు పెంచారు. అయితే సివిల్, మెకానికల్ బ్రాంచ్‌లలో అడ్మిషన్లు తగ్గాయి. రెండు, మూడు కాలేజీల్లో మాత్రమే కొంత మేరకు అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే భవిష్యత్తులో సివిల్, మెకానికల్ ఇంజనీర్ల కొరత ఏర్పడే అవకాశం ఉంది.

చెత్త వాహనం వద్దకు చెత్త బుట్టలను తీసుకువెళ్తున్న విద్యార్థినులు



పారిశుద్ధ్య కార్మికులుగా హాస్టల్ బాలికలు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు చెందిన విద్యార్థినులు పారిశుద్ధ్య కార్మికులుగా మారిన ఘటన శుక్రవారం కర్నూలులో చోటు చేసుకుంది. చెత్త సేకరణలో భాగంగా కర్నూలు నగర పాలక సంస్థకు చెందిన వాహనం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని హాస్టళ్ల వద్దకు వచ్చింది. కలెక్టరేట్ సమీపంలో ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలు మూడు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయా వసతి గృహాల్లో వర్కర్లు ఉన్నారో, లేదో తెలియదు కాని, విద్యార్థినులే తమ వసతి గృహాల్లోని చెత్త బుట్టల్లోని చెత్తను వాహనంలోకి వేసేందుకు తీసుకురావడం చర్చనీయాంశం అయ్యింది. కాగా, రాయలసీమ పరిధిలోని నాలుగు ఉమ్మడి జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులందరితో సంబంధిత మంత్రి తిరుపతిలో సమావేశం ఏర్పాటు చేసిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సాంఘీక సంక్షేమ శాఖకు చెందిన అధికారులందరు తిరుపతికి వెళ్లడం గమనార్హం.

254 ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలే లక్ష్యంగా కార్యాచరణ

- జెడ్పీ సీఈఓ, డీపీఓ

కర్నూలు(అర్బన్): జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 254 గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్ (బహిరంగ మల విసర్జన రహిత)గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్ చెప్పారు. శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సమావేశమై జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించి సంబంధిత ఎంపీడీఓలకు కార్యాచరణను సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... మొత్తం 484 గ్రామ పంచాయతీల్లో 351 గ్రామ పంచాయతీల్లో వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. అలాగే వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ కింద 4271, ప్రధానమంత్రి ఆవాజ్ మోజన గ్రామీణ్ కింద 16,106 వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించాల్సి ఉందన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించి మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు కార్యోన్ముఖులు చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారుల సమన్వయంతో 277 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను నిర్మించాలన్నారు. జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు 409 సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లను నిర్మించామని, మిగిలిన వాటిని ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధిత ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే 208 గ్రామాల్లో లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లను ఏర్పాటు చేయాలన్నారు.


వివిధ అంశాలపై చర్చిస్తున్న జెడ్పీ సీఈఓ, డీపీఓ

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో 2025–26 విద్యా సంవత్సరానికి మిగిలిన ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు మూడో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ బాలికల కాలేజీ ప్రిన్సిపల్ ఎల్.నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఓఓఓ.జీజీ.్ర ఐజౌఓ.జీ ఽ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. చేరాల్సిన ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐలను ఇచ్చిన పట్టికలో ఎంపిక చేసుకోని ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికేట్స్ వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులు మాత్రమే అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు అనుమతిస్తారని, 27వ తేదిన వెరిఫికేషన్ ఉంటుందన్నారు. ప్రభుత్వ ఐటీఐ కాలేజీల్లో దరఖాస్తులు చేసుకున్న వారికి 29వ తేదిన, ప్రైవేటు కాలేజీల్లో దరఖాస్తూలు చేసుకున్న వారికి 30వ తేదిన కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

గాలుల తీవ్రత పెరిగే అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో గాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటించారు. వచ్చే ఐదు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం లేదని, ఒకటి, రెండు చోట్ల జల్లులు కురిస్తున్నాయని పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు 32.7 డిగ్రీల నుంచి 33.2 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. పశ్చిమం నుంచి వాయువ్యం దిశగా గాలులు గంటకు 9–11 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.